అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి



బన్సీలాల్‌పేట్‌లో ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన డాక్టర్ కోట నీలిమ

బన్సీలాల్‌పేట్: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు పేదలు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. శుక్రవారం ఆమె బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్, బోయిగూడలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సెంటర్లను సందర్శించారు. దరఖాస్తుల తీరుతెన్నులను పరిశీలించి జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే గ్యారంటీ పథకాలకు అభయ హస్తం కింద అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలుపుకుంటామని, ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద అందించే వైద్య సేవల పరిమితిని రూ. 10లక్షలకు పెంచిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొంటుందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సివరేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం



మహ్మద్‌గూడలో పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడ ఏకే ఫంక్షన్‌హాల్ సమీపంలో రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టిన సివరేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను జలమండలి అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ సామల హేమ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మారావు సహాయ సహకారాలతో డివిజన్ పరిధిలోని పలు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కారంపై సంబంధిత అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో జలమండలి మారేడుపల్లి డీజీఎం కృష్ణ, శ్రీనివాసనగర్ సెక్షన్ మేనేజర్ నవ్యలతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో సమస్యలు పరిష్కరించండి



ఓయూ మోడల్ స్కూల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మోడల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి రవినాయక్ డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలకు గత రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, మధ్యాహ్నం భోజనం, ఇతర వస్తువులు అందడం లేదన్నారు. టీచర్లకు వేతనాలను పెంచాలని, పీఈటీని నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణంలో ఉన్నందున ఆ పాఠశాలను కూడా ఇందులోనే కొనసాగించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఓయూ అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అంధకారంలో బస్తీలు

- పట్టించుకోని అధికారులు
- ఫిర్యాదులపై స్పందన కరువు



ఆర్యనగర్‌లో వెలుగని స్ట్రీట్ లైట్స్

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్‌లోని పలు బస్తీల్లో గత కొన్ని రోజులుగా స్ట్రీట్ లైట్స్ వెలుగడం లేదు. దీంతో ఆర్యనగర్, శాంతినగర్, లాలాపేట తదితర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో అంధకారం నెలకొంది. ఈ కారణంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరో వైపు డ్రైనేజీలు పొంగి రోడ్లపై పారుతుండటంతో బురద నీటిలో నుంచే వెళ్లాల్సి వస్తుంది. దీంతో స్థానికులు, మహిళలు, చిన్నారులు రాత్రి సమయాల్లో ఇంట్లో నుంచి ఒంటరిగా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. స్ట్రీట్ లైట్స్‌ను మరమ్మతు చేయాలని పలు బస్తీల వాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తప్పిపోయిన బాలికను శుక్రవారం రైల్వే పోలీసులు తల్లితండ్రులకు అప్పగించారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను, ఎస్‌ఐ మాజిద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్‌కు చెందిన మారసాని మహేశ్‌యాదవ్, ఈశ్వరి దంపతులు కుమార్తెతో (03) సహా రైల్వేస్టేషన్‌కు వచ్చారు. స్టేషన్‌లో ఆడుకుంటూ బాలిక తప్పిపోయింది. 7వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఒంటరిగా తచ్చాడుతున్న బాలికను గుర్తించిన రైల్వేపోలీసులు చైల్డ్‌లైన్ సంస్థ ప్రతినిధులకు అప్పగించారు. అదే సమయంలో బాలిక తల్లితండ్రులు తమ కుమార్తె కనిపించడం లేదని జీఆర్‌పీ పోలీసులకు ఆశ్రయించారు. దీంతో చిన్నారిని వారికి అప్పగించారు.

లష్కర్ ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ అన్నారు. అడ్డగుట్టకు చెందిన శ్రీనివాస్, పార్శిగుట్టకు చెందిన విజయ్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్సలకు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యే శుక్రవారం బాధితులకు మంజూరైన రూ.2.5 లక్షల సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మారిన నేపథ్యంలో ప్రజలు ఆందోళనకు గురికావద్దన్నారు. ప్రభుత్వం ఏదైనా సికింద్రాబాద్ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తీగుళ్ల కిరణ్‌గౌడ్, మల్లూరి అనిల్, బాల్‌రాజ్‌గౌడ్, వైపీ బాలాజీ, టీఆర్‌టీ శేఖర్, విజయలక్ష్మి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

డైరీ, కేలండర్ ఆవిష్కరణ

జంటనగరాలకు చెందిన ప్రముఖ విబ్సన్ ఫార్మా సంస్థ వార్షిక డైరీని, శ్రీనివాస్‌నగర్‌కు చెందిన సుప్రసిద్ధ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్వాహకులు రూపొందించిన కొత్త సంవత్సరం కేలండర్‌ను ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ శుక్రవారం సీతాఫల్‌మండిలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో సికింద్రాబాద్ ప్రాంత ప్రజలకు విబ్సన్ సంస్థ నిర్వాహకులు అందించిన వైద్యసేవలు అభినందనీయమన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఫార్మా సంస్థలు పేద ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ముందుకు రావాలన్నారు. విబ్సన్ సీఎండీ సుంకు రాంచందర్, బీఆర్‌ఎస్ నాయకులు ఆలకుంట హరిబాబు, నీల ప్రభాకర్, బోల్ల సుమీత్‌యాదవ్, కైరంకొండ యాదగిరి, యాద క్రాంతి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పద్మారావునగర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని పలువురు వక్తలు సూచించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా శుక్రవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీ, చాచానెహ్రూనగర్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త టి. రాజశేఖరరెడ్డి, నాయకులు వై. సురేష్‌కుమార్ తదితరులు మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పేదల కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. పీఎం జన ఆరోగ్య యోజన కింద రూ. 5లక్షల ఆరోగ్య బీమా, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ద్వారా పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, పీఎం ముద్ర యోజనతో మహిళకు 58శాతం రుణాలు తదితర పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలోకి తీసుకెళ్లడానికి ప్రధాని నిర్మాణాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వై. శ్రీనివాస్, ఉమేష్ ఖండేల్వాల్, ఈశ్వర్, కె. క్రిష్ణ, కుర్మ శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలతో పాటు కేలండర్‌ను ఆవిష్కరించారు.



కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

అడ్డగుట్ట: ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేసి దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. ఈ మేరకు శుక్రవారం మహాత్మ జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అత్యాచారాల చట్టం అమలుపై రెవెన్యూ, పోలీసు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన హైపవర్ కమిటీ వేసి దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను సమీక్షించి నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహించాలని కోరారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ప్రతి నెల చివరన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించి కుల వివక్షను రూపుమాపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు న్యాయాధికారాలు కల్పించి, దాడులకు గురవుతున్న బాధితులకు తక్షణ సహాయం, నష్ట పరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ఎస్సీ ఎస్టీ కమిషన్‌ను విభజించాలన్నారు. సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్స్ చార్జీలను పెంచాలని కోరుతూ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. డిబిఎఫ్ నాయకులు పీ. శంకర్, పులి నవీన్ కుమార్ ఉన్నారు.



ప్రజావాణిలో వినతిపత్రం సమర్పిస్తున్న డీబీఎఫ్ నాయకులు

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

సికింద్రాబాద్: రైల్వేశాఖలో అమలులోకి తెచ్చిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని దక్షిణమధ్యరైల్వే మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యదర్శి సీహెచ్.శంకర్‌రావు డిమాండ్ చేశారు. ఈనెల 6 నుంచి 11 వరకు కొత్త పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం సికింద్రాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపేట జనరల్ బ్రాంచి మజ్దూర్ యూనియన్ నాయకులు రూపొందించిన టికెట్ చెకింగ్‌స్టాఫ్ రఫ్ బుక్కులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తపెన్షన్ విధానం వల్ల రైల్వే కార్మికులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయించడం కోసం యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలకు ఉద్యోగులు, కార్మికులు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు కాల్వ శ్రీనివాస్, ఉదయభాస్కర్, రవీందర్, బాలమురి, శ్రీనివాస్, రాజు, యుగంధర్, సమ్మయ్య, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టికెట్ చెకింగ్ స్టాఫ్ రఫ్ బుక్కులను ఆవిష్కరిస్తున్న శంకర్‌రావు

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



సుదర్శనహోమం నిర్వహిస్తున్న దృశ్యం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సుదర్శనహోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణలతో పద్మావతి గోదాసమేత ప్రసన్న వెంకన్నస్వామి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వార్షిక ధనుర్మాస వేడుకల్లో భాగంగా ఈనెల 12న కూడారవల్లి ఉత్సవం, 14న గోదాకల్యాణం, 15న మకరసంక్రమణ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఈఓ రాజేష్‌కుమార్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం మరింగంటి విజయ్‌కుమార్ ఆలపిస్తున్న తిరుప్పావై ప్రవచనాలు ఆహుతులను అలరిస్తున్నాయి. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బాలభాస్కర్, సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సుజయ్‌ప్రకాశ్, రామచందర్‌లతోపాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.21, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 55, పందిరి బీర 45, క్యాబేజీ 18, క్యారెట్ 38, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 55, గోకరకాయ 50, కీర 15, దోసకాయ 35, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 24, ఆలుగడ్డ 21, చామగడ్డ 55, మొరంగడ్డ 28, కందగడ్డ 23, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేటితో ముగియనున్న ప్రజాపాలన

తార్నాక డివిజన్‌లో 1315 దరఖాస్తులు

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో శుక్రవారం కొనసాగిన ప్రజాపాలనకు దాదాపు 1315 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు రేషన్ కార్డుల కోసం 2700 వచ్చాయన్నారు. తార్నాక నాగార్జున నగర్ కమ్యూనిటీహాల్ కేంద్రంలో 150, లాలాపేట వినోభానగర్ కమ్యూనిటీహాల్‌లో 200, తార్నాక వార్డు కార్యాలయంలో 677, మాణికేశ్వర్‌నగర్ ఏడుగుళ్ల కమ్యూనిటీ హాల్ 288 దరఖాస్తులు అందాయన్నారు. గడువు ముగుస్తుండటంతో ఈ నాలుగు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లకు దరఖాస్తులు అందజేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. శనివారంతో ప్రజాపాలన కార్యక్రమం ముగియనున్నందున అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిధుల దుర్వినియోగాన్ని అరికట్టండి

రాంగోపాల్‌పేట్: ఆంగ్లో ఇండియన్ క్రిస్మస్ పేరుతో జరుగుతున్న నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని ఆల్ ఇండియా దళిత క్రైస్తవ సమాఖ్య కార్యదర్శి జెరూసలేం మత్తయ్య, క్యాథలిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధి ఆండ్రూ జేవియర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. గత కొంత కాలంగా ప్రభుత్వం ఆంగ్లో ఇండియన్ క్రిస్మస్ పేరుతో రూ.30లక్షల బడ్జెట్ కేటాయించిందన్నారు. ఈ నిధులను ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఓ వ్యక్తి తన సొంత సంస్థకు మళ్లించారని ఆరోపించారు. కేవలం కొద్ది మందిని మాత్రమే వేడుకలకు ఆహ్వానించి నిధులు స్వాహా చేశాడని ఆరోపించారు. సదరు వ్యక్తికి ఆంగ్లో ఇండియన్ సామాజిక వర్గానికి ఎలాంటి సంబంధం లేకపోయినా అధికారులను తప్పుదోవ పట్టించి నిధులను దుర్వినియోగం చేస్తున్నాడన్నారు.

సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా పురేందర్‌రెడ్డి



సనత్‌నగర్: సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఏ పురేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా సనత్‌నగర్‌లో పనిచేస్తున్న బాలరాజ్‌ను సైబరాబాద్ సీటీసీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో వెస్ట్ జోన్ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న పురేందర్‌రెడ్డిని సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2009 బ్యాచ్‌కు చెందిన పురేందర్‌రెడ్డి నగరంలోని హుమాయూన్‌నగర్, చిక్కడపల్లి, చార్మినార్ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు.

రిటైర్డ్ స్టేషన్ మాస్టర్లకు న్యాయం చేయండి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ స్టేషన్ మేనేజర్ల సంఘం ప్రతినిధులు

సికింద్రాబాద్: సకాలంలో ఎంఏసీపీ పథకం వర్తింపజేయని కారణంగా పదవీరమణ చేసిన స్టేషన్‌మాస్టర్లకు పెద్దమొత్తంలో ఆర్థిక నష్టం జరుగుతుందని దక్షిణమధ్య రైల్వే స్టేషన్ మాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఏసీపీ పథకం వర్తింపజేయని కారణంగా 2016 నుంచి 2018 జనవరి మధ్య పదవీవిరమణ చేసిన స్టేషన్ మాస్టర్లకు నెలకు రూ.5400 నష్టం జరుగుతుందన్నారు. ఏడవ పే కమిషన్ నిబంధనలు వర్తింపజేసి పదవీవిరమణ చేసిన స్టేషన్ మాస్టర్లకు న్యాయం చేయాలని కోరారు. రిటైర్డ్ స్టేషన్ మాస్టర్స్ జాతీయ అధ్యక్షుడు జీ.మురళీధర్, జోనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎన్. ముకుందరావు, బీజేపీ నాయకుడు పీ.రవిప్రసాద్‌గౌడ్ నేతృత్వంలో పలువురు విశ్రాంత స్టేషన్ మేనేజర్లు కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి



ఇందిరానగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. ఇందిరానగర్ కమ్యూనిటీహాల్‌లో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తులకు ఇబ్బందులు లేకుండా సీతాఫల్‌మండిలోని సికింద్రాబాద్ ఎమ్మెల్యే కార్యాలయంతో పాటు ప్రజా పాలన కార్యక్రమాల వేదికల వద్ద పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా దరఖాస్తులు స్వీకరించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు, ఉద్యోగులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాపాలన నిర్వాహక అధికారులు సువర్ణ, అబీబ్, పద్మారావు, శ్రీకాంత్, నేహ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు



బేగంపేటలో ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన సర్వే సత్యనారాయణ

సనత్‌నగర్: ప్రజాపాలన కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్ తాతాచారి కాలనీ గ్రౌండ్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అభయహస్తం ఆరు గ్యారంటీల పథకాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు హోసీటోచర్, జైపాల్, జాన్, రమాదేవి, దయాకర్, రమ, యాదగిరి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సనత్‌నగర్: మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేట అన్నానగర్‌కు చెందిన మల్లయ్య కుమారుడు వెంకటేష్ (25) మానసిక సమస్యలతో బాధపడుతూ ఏడాదిగా చికిత్స పొందుతున్నాడు. గురువారం బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకు వెళ్లిన అతను తల్లితో కలిసి ఇంటికి వచ్చాడు. ఇంట్లో వెంకటేష్‌ను ఇంట్లోనే ఉంచి తల్లి పనికి వెళ్లింది. సాయంత్రం ఆమె ఇంటికి తిరిగి వచ్చే సరికి గది తలుపు లోపలి నుంచి గడియ పెట్టి ఉండడంతో అనుమానంతో కిటికీలో నుంచి తలుపు తీసి చూడగా వెంకటేష్ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. ఆమె కేకలు విని అక్కడికి చేరుకున్న స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

బీబీఏ పరీక్షకు వేర్వేరు ప్రశ్నాపత్రాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో కొనసాగుతున్న బీబీఏ సెమిస్టర్ పరీక్షకు వేర్వేరు ప్రశ్నాపత్రాలు వచ్చాయని విద్యార్థులు కంట్రోలర్ ప్రొ.రాములు దృష్టికి తీసుకెళ్లారు. సిద్దార్థ డిగ్రీ కాలేజీతో పాటు కేశవ మెమోరియల్ కాలేజీల్లో రెండు రకాలు ప్రశ్నాపత్రాలు అందజేశారన్నారు. ప్రశ్నపత్రాలు వేరైనా ప్రశ్నలు ఒకటేనని విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగదని ప్రొ.రాములు పేర్కొన్నారు.